టీచర్లు హెడ్‌క్వార్టర్లు వదిలివెళ్లరాదు..

డీఈవో సోమశేఖరశర్మ

ఖమ్మం అర్బన్, ఏప్రిల్ 21 : ఖమ్మం జిల్లాలోని ఉపాధ్యాయులు హెడ్‌క్వార్టర్లు వదిలి వెళ్లరాదని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, హెచ్‌ఎంలు మే నెలలో అందుబాటులో ఉండాలని స్పష్టంచేశారు. అన్ని క్యాడర్ల ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు ఉన్నందున జిల్లా కేంద్రం వదిలి వెళ్లరాదని, శిక్షణ తరగతులకు అందరూ ఉపాధ్యాయులు అందుబాటులో ఉండాలన్నారు.

రిసోర్స్‌పర్సన్లకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రాథమిక, ఉన్నత పాఠశాలల స్థాయిలో మండల, జిల్లాస్థాయిలో రిసోర్స్‌పర్సన్స్‌గా పని చేయడానికి ఆసక్తి గల ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకోవాలని డీఈవో సోమశేఖరశర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్ణీత నమూనాలో ఈ నెల 24వ తేదీ లోపు జిల్లా విద్యాశాఖాధికారికి దరఖాస్తులు అందజేయాలని సూచించారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ఎంపిక కమిటీ రిసోర్స్‌పర్సన్లను ఎంపిక చేస్తుందని స్పష్టం చేశారు.

– ఈ నెల 30వ తేదీ వరకు మండల, జిల్లా పరిధిలో రిసోర్స్‌పర్సన్స్ ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి ఎస్‌సీఈఆర్‌టీకి పంపాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

– కలెక్టర్, డీఈవో, డైట్ అధ్యాపకులు, బీఎడ్ అధ్యాపకులు, యూనివర్సిటీ అధ్యాపకులు కలిసి ఇంటర్వ్యూ డీమోలు నిర్వహించి ఎంపిక చేయాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

- ప్రతి మండలం నుంచి ప్రతి సబ్జెక్ట్‌లో ఇద్దరు ఎస్‌జీటీల చొప్పున, జిల్లాల పరిధిలో స్కూల్ అసిస్టెంట్లను రిసోర్స్‌పర్సన్స్‌లను ఎంపిక చేయాలని ఆదేశించారు.

222మంది అవసరమని అంచనా..?

గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయులు జిల్లా, మండల స్థాయిల్లో రిసోర్స్‌పర్సన్స్ 222మంది అవసరమని విద్యాశాఖాధికారులు అంచనా వేశారు. గెజిటెడ్, ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయుల శిక్షణకు 8మంది, ఉన్నతస్థాయిలో తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గణితం, భౌతికశాస్త్రం, జీవశాస్త్రం, సాంఘికశాస్త్రం, శారీరక విద్య అండ్ సమ్మిళిత విద్యకు నలుగురు చొప్పున 36మంది, ప్రైమరీ(మండల స్థాయిలో) 168మంది, ప్రైమరీ(జిల్లా స్థాయిలో) 10మంది అవసరమని డీఈవో సోమశేఖరశర్మ, అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ కేశవపట్నం రవికుమార్ అంచనా వేశారు.

పార్ట్‌టైం అధ్యాపకుల చాక్‌పీస్ డౌన్

ఖమ్మం అర్బన్, ఏప్రిల్ 21 : ఆల్ యూనివర్సిటీస్ పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం యూనివర్సిటీ పీజీ కళాశాలలో 'సీఎం గారూ.. మా మొర వినండి' అనే నినాదంతో పీజీ, ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న పార్ట్‌టైం, కాంట్రాక్ట్ అధ్యాపకులు చాక్‌పీస్ డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 20 ఏళ్లు వివిధ విభాగాల్లో అన్ని అర్హతలు కలిగి ఉండి వారానికి 16 పీరియడ్స్ పూర్తి వర్క్‌లోడ్‌తో పనిచేస్తున్నా నేటికీ కాంట్రాక్ట్ అధ్యాపకులుగా అప్‌గ్రేడ్ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్ట్‌టైం అధ్యాపకులు శేఖర్, వీరన్న, రవిబాబు, వీరాంజనేయులు, మధు, లక్ష్మీహరిత, రాణి, తిలక్, రవికుమార్, శ్యాంబాబు పాల్గొన్నారు.

ప్రాణహాని ఉంది.. కాపాడండి!

ఓ మహిళ ఆవేదన

ఖమ్మం సిటీ, ఏప్రిల్ 21 : అత్త, మామ, మరిది, తోటి కోడలుతో తనకు, పిల్లలకు ప్రాణహాని ఉందని, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని సీహెచ్ అనుపమ అనే మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. సోమవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ దానవాయిగూడెం రోడ్డు సారథినగర్ బొడ్రాయి సెంటర్ ప్రాంతంలో నివాసం ఉంటున్నట్లు తెలిపింది. తన భర్త మరణం అనంతరం ఉమ్మడి ఆస్తిని పిల్లలకు చెందనీయకుండా మరిది మణికుమార్ గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని వెల్లడించింది. త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదులు చేసినప్పటికీ స్పందించడం లేదని, ఉన్నతాధికారులు తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసింది.

గోశాలలకు వరిగడ్డి వితరణ

రఘునాథపాలెం, ఏప్రిల్ 21 : ఖమ్మం జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు తుపాకుల యలగొండస్వామి ఖమ్మం నగరం టేకులపల్లి గోశాలకు 20 ట్రక్కుల వరిగడ్డిని సోమవారం వితరణగా అందజేశారు. గోశాలలోని గోవులు ఆకలితో అలమటిస్తున్నట్లు తెలుసుకొని మంత్రి తుమ్మల ఆదేశాల మేరకు వరిగడ్డిని వితరణ చేసినట్లు యలగొండస్వామి తెలిపారు.

రజతోత్సవ సభకు తరలిరావాలి

కారేపల్లి సమావేశంలో ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీ మధు

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వద్దిరాజు, చిత్రంలో ఎమ్మెల్సీ తాతా మధు, నాయకులు

కారేపల్లి, ఏప్రిల్ 21: ఈ నెల 27న వరంగల్‌లోని ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ బహిరంగ సభకు వైరా నియోజకవర్గం నుంచి భారీగా తరలిరావాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు పిలుపు నిచ్చారు. మండలంలోని కారేపల్లి క్రాస్‌రోడ్‌లో మాజీ వార్డు సభ్యుడు సిద్దంశెట్టి నాగయ్య నివాసంలో సోమవారం రాత్రి బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశం లో వారు మాట్లాడారు. బహిరంగ సభకు వచ్చే కార్యకర్తలు, ప్రజలు, అభిమానులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. సభ కు వెళ్లే రోజు ప్రతీ గ్రామంలో గులాబీ జెండా ఎగురువేయాలన్నారు. సమావేశంలో వైరా నియోజకవర్గ ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, బీఆర్‌ఎస్ నాయకులు అడపా పుల్లారావు, బానోత్ రాందాస్‌నాయక్, దాచేపల్లి కృష్ణారెడ్డి, మద్దెబోయిన సత్యనారాయణ, సిద్దంసెట్టి పెద్దనాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని..

కాంగ్రెస్ నేత ఆత్మహత్యాయత్నం

- పంచాయతీ కార్యాలయంలోనే పెట్రోలు పోసుకున్న బోనకల్లు వైస్ ఎంపీపీ
- సాక్షాత్తూ డిప్యూటీ సీఎంకు చెప్పినప్పటికీ జాబితాలో తన పేరు లేదని ఆవేదన
- తన కాంగ్రెస్ ప్రభుత్వమే తనను మోసం చేస్తే.. ఇంకెవరు న్యాయం చేస్తారంటూ ప్రశ్న
- తనకు ఇల్లు రాకుంటే అర్హులైన పేదలకూ అన్యాయం జరుగుతుందని స్పష్టీకరణ

ఇల్లు రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న రమేశ్

బోనకల్లు, ఏప్రిల్ 21 : తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదంటూ కాంగ్రెస్ నాయకుడు, బోనకల్లు మాజీ వైస్ ఎంపీపీ పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఖమ్మం జిల్లా బోనకల్లులో సోమవారం చోటుచేసుకుంది. తన పార్టీ, తన ప్రభుత్వమే తనకు అన్యాయం చేసిందంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ మేరకు ఏకంగా బోనకల్లు పంచాయతీ కార్యాలయంలోనే తన శరీరంపై పెట్రోల్ వేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు.. నిప్పంటించుకోబోయిన ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని ఆత్మహత్యాయత్నానికి సంబంధించి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ వైస్ ఎంపీపీ గుగులోతు రమేశ్ మాట్లాడుతూ.. తాను కాంగ్రెస్ నాయకుడినని, కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ఇందిరమ్మ ఇల్లు వస్తుందని ఆశపడ్డానని, కానీ అధికారులు, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా తనకు ఇల్లు మంజూరు కాలేదని వాపోయాడు. ప్రభుత్వ సర్వేలో తనకు ఇల్లు ఉన్నట్లుగా అధికారులు నమోదు చేశారని, కానీ తనకు ఇల్లు లేదని విషయాన్ని ప్రభుత్వం కూడా గుర్తించలేదని అన్నారు. తన సోదరుడు శ్రీను ఇంట్లోనే ఎన్నో ఏళ్లుగా అద్దెకు ఉంటున్నానని తెలిపాడు. తనకు ఇంటి స్థలం ఉన్నప్పటికీ, గిరిజనుడిని అయినప్పటికీ తన ప్రభుత్వం తనకు ఇల్లు మంజూరు చేయకపోవడానికి కారణమేంటో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామంటూ చెబుతున్న తమ కాంగ్రెస్ ప్రభుత్వం.. అర్హుడినైన, కాంగ్రెస్ ప్రజాప్రతినిధిగా పనిచేసిన తనకే ఇల్లు మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, తనకు ఇల్లు మంజూరు చేయాలని సాక్షాత్తూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు చెప్పానని వివరించారు. అయినప్పటికీ జాబితాలో తన పేరు లేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తాను నమ్మిన తన కాంగ్రెస్ ప్రభుత్వమే తనను మోసం చేసిందని ఆరోపించారు. ఇక తనకెవరు న్యాయం చేస్తారని ప్రశ్నించారు. ఈ మనస్తాపంతోనే ఆత్మహత్య చేసుకోబోయానని అన్నారు. అర్హుడినైన తనకే ఇందిరమ్మ మంజూరుకాకపోతే అసలైన పేదలకూ ఇళ్లు రాకుండా అన్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు.

ప్రమాణాలు పాటిస్తూ ధాన్యం కొనుగోలు

అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి

ఖమ్మం, ఏప్రిల్ 21 : యాసంగి పంట కొనుగోలు కేంద్రాల్లో భారత ఆహార సంస్థ నిర్దేశించిన ఎఫ్‌ఏక్యూ. ప్రమాణాలు పాటించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలుపై రైస్‌మిల్లర్లు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు పాటించని పక్షంలో సదరు కేంద్రాల నిర్వహకులపై చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మ రాజేశ్వరరావు, పౌరసరఫరాల డీటీలు, మిల్లర్లు, అధికారులు పాల్గొన్నారు.

'పిల్లలను అతిగా గారాబం చేయవద్దు'

ఖమ్మం రూరల్/ రఘునాథపాలెం, ఏప్రిల్ 21: అతి గారాబం వల్ల పిల్లలు చెడిపోయే ప్రమాదం ఉందని బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ భారతీరాణి తల్లిదండ్రులను హెచ్చరించారు. ఇండియా ఫౌండేషన్ సహకారంతో స్కోప్ ఆర్డీ సంస్థ ఆధ్వర్యంలో ఏదులాపురం మున్సిపాలిటీ ఎస్‌బీఐ రిసోర్స్ ట్రైనింగ్‌లో 'పిల్లలను పెంచడం ఎలా' అనే అంశంపై సోమవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.

27న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

పెనుబల్లి, ఏప్రిల్ 21: మండలంలోని టేకులపల్లి మోడల్ స్కూల్‌లో ప్రవేశాల కోసం ఈ నెల 27వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు 6వ తరగతికి,మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు 7 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ప్రవేశాలకు పరీక్ష ఉంటుందని ప్రిన్సిపాల్ టీబీ.రూపస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అర్జీలను వెంటనే పరిష్కరించాలి: డీఆర్‌వో

మామిళ్లగూడెం, ఏప్రిల్ 21: ప్రజావాణి అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని డీఆర్‌వో ఏ.పద్మశ్రీ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి లో డీఆర్‌డీవో సన్యాసయ్యతో కలిసి ప్రజల నుంచి సమస్యల వినతులు స్వీకరించారు. పరిష్కారం కోసం వాటిని సంబంధిత శాఖల అధికారులకు రిఫర్ చేశారు. కలెక్టరేట్ ఏవో అరుణ, అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

ఖమ్మం, ఏప్రిల్ 21: ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలని, దరఖాస్తుదారుడికి రాతపూర్వకంగా సమాధానం ఇవ్వాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులను ఆదేశించారు. కేఎంసీలోని తన చాంబర్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అర్జీదారుల నుంచి కమిషనర్ వినతులు స్వీకరించారు. అధికారులతో మాట్లాడుతూ అర్జీలకు వెంటనేపరిష్కారం చూపాలని ఆదేశించారు.

న్యూఇరాలో ఐన్‌స్టీన్ మెమోరియల్ వీక్ వేడుకలు

ఖమ్మం అర్బన్, ఏప్రిల్ 21 : ఖమ్మం నగరంలోని న్యూఇరా పాఠశాలలో సోమవారం ఐన్‌స్టీన్ వీక్ వేడుకల కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల సృజనాత్మకత, విజ్ఞానాన్ని పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తుందని చైర్మన్ ఇంజం వెంకటరమణరావు అన్నారు.

చట్టానికి అనుగుణంగానే జీవోలు చేయాలి

- సమగ్ర భూసర్వే తర్వాతే 'భూ భారతి' అమలుచేయాలి
- అవగాహన సదస్సులో అఖిలపక్ష నేతలు, రైతులు

అభిప్రాయం వెల్లడిస్తున్న సీపీఐ నేత బాగం హేమంతరావు

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 21: నూతన భూ భారతి చట్టంలో పొందుపరచిన అంశాలకు అనుగుణంగానే జీవోలను విడుదల చేయాలని ఆయా పార్టీల నాయకులు, రైతులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. భూ భారతి చట్టంపై ఏదులాపురంలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఎంపీ రఘురామరెడ్డి, ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీజ, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఎంపీ, అధికారులు మాట్లాడిన అనంతరం భూ భారతి చట్టంలోని 3, 7, 9, 11 సెక్షన్లపై తమకున్న అభ్యంతరాలను సీపీఐ నేతలు బాగం హేమంతరావు, దండి సురేష్, సీపీఎం నేత ఊరడి సుదర్శన్‌రెడ్డితో పాటు పలువురు రైతులు వెలిబుచ్చారు. అధికారంలోకి రాకముందు అసైన్డ్ భూములకు పట్టాలిస్తామని కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారని గుర్తుచేశారు, ఆ భూములకు పట్టాలిచ్చి రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ చార్జీలను తగ్గించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలన్నారు. భూ భారతి చట్టం అమల్లోకి తీసుకొచ్చే ముందు ప్రతి భూమిని డిజిటలైజేషన్ ద్వారా గానీ, ఇతర మార్గాల్లో కానీ పూర్తిస్థాయిలో సమగ్ర భూసర్వే చేయాలన్నారు. అధికారులు అభిషేక్ అగస్త్య, నర్సింహారావు, పుల్లయ్య, రాంప్రసాద్, కుమార్ పాల్గొన్నారు.

భూ హక్కుల రికార్డుల్లో..

తప్పుల సవరణకు అవకాశం

అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, కేఎంసీ మేయర్ నీరజ

మాట్లాడుతున్న మేయర్ నీరజ

ఖమ్మం, ఏప్రిల్ 21: భూ సమస్యల పరిష్కారం, భూ హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తెచ్చిందని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. స్థానిక డీపీఆర్సీ భవనంలో ఖమ్మం అర్బన్ మండలానికి సంబంధించి సోమవారం భూ భారతి కొత్త ఆర్‌ఓఆర్ చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, ఆర్డీవో నర్సింహారావు, వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ మురళి, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారం: రాజేశ్వరి

కూసుమంచి (నేలకొండపల్లి), ఏప్రిల్ 21: భూ భారతిలో భూముల సమస్యలు పరిష్కారమవుతాయని నియోజకవర్గ స్పెషలాఫీసర్ రాజేశ్వరి అన్నారు. మండలంలోని అప్పలనర్సిహాపురం, రాజారాంపేట, కొరట్లగూడెం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన గ్రామసభల్లో ఆమె మాట్లాడారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు, అఫ్జల్ హుస్సేన్, డీటీ ఇమ్రాన్, ఏవో రాధ, అధికారులు పాల్గొన్నారు.

రైతులు దరఖాస్తు చేసుకోవాలి: ఎంపీ

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 21: భూముల సమస్యలున్న రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీ రఘురాం రెడ్డి సూచించారు. భూభారతి చట్టంపై ఏదులాపురంలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీజ, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఆర్డీవో నర్సింహారావు, డీఏవో పుల్లయ్య, తహసీల్దార్ పీ రాంప్రసాద్, ఎంపీడీవో కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి కృషి: ఎంపీ

ఖమ్మం సిటీ, ఏప్రిల్ 21: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధి, రోగులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తానని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. సోమవారం దవాఖానలోని మార్చురీకి ఎంపీ లాడ్స్ నిధులు రూ.8 లక్షలతో కేటాయించిన ఎనిమిది ఫ్రీజర్లను అందజేశారు. తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్‌ను పరిశీలించారు. స్థానిక వైద్యాధికారుల వినతి మేరకు రెండు బోర్లు వేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాయల నాగేశ్వరరావు, మేయర్ నీరజ, డాక్టర్లు కిరణ్ కుమార్, బాబూ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

తూకం వేస్తేనే.. బియ్యం దించుకుంటాం

ఖమ్మం అర్బన్ రేషన్‌డీలర్ల తీర్మానం

రఘునాథపాలెం, ఏప్రిల్ 21: ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద సన్నబియ్యం లారీలను తూకం వేసి పంపిస్తేనే రేషన్‌షాపుల్లో దించుకుంటామని ఖమ్మంఅర్బన్ రేషన్‌డీలర్లు తీర్మానం చేశారు. సోమవారం ఖమ్మం నగర రేషన్‌డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రేషన్‌డీలర్లు ఖమ్మం నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సమావేశమయ్యారు. ఏప్రిల్ నెలలో సన్నబియ్యం పంపిణీ సందర్భంగా షాపులకు వచ్చిన బియ్యం బస్తాలు తరుగురావడంతో వచ్చిన నష్టాన్ని డీలర్లు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఇది పునరావృతం కాకుండా ఉండాలంటే ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద బియ్యం లారీలను తూకం వేసిన తరువాతనే షాపులకు తెచ్చుకుందామని తీర్మానం చేసుకున్నారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో రేషన్‌డీలర్లకు ఇచ్చిన హామీ ప్రకారం రూ.5 వేల గౌరవవేతనం, రూ.300 కమీషన్ సాధించుకునేందుకు పోరాటం చేయాల్సిన అవసరం ఉందని ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు మోటమర్రి చంద్రశేఖర్‌రావు పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం నాయకులు వాకదాని శ్రీనివాసరావు, ఉమారఫీ, గోళ్ల మురళి, రత్నాకరం సాయికృష్ణ, లగిశెట్టి వెంకటేశ్వర్లు, సుధాకర్‌రావు, శేఖర్‌బాబు, రాధాకృష్ణ, హరిబాబు, శ్యాంబాబు, ఖాజామియా, సంజీవరావు, ఖాసీం, రాంబాబు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పన కోసం.. మూడంచెల వ్యూహం: భట్టి

మధిర, ఏప్రిల్ 21: యువతకు ఉపాధి కల్పన కోసం మూడంచెల వ్యూహం అమలు చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. మధిరలో సోమవారంఏర్పాటుచేసిన మెగా జాబ్‌మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉద్యోగ మేళాలో 97 కంపెనీలు పాల్గొన్నాయని, 5 వేల మందికి ఉద్యోగాలు ఇవ్వడానికి ముందుకొచ్చాయని వివరించారు. మొదటి సంవత్సరంలోనే ఖాళీగా ఉన్న 56 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, త్వరలోనే మరో 30 వేల ఉద్యోగాలు భర్తీకి కసరత్తు జరుగుతోందని అజిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ పీ.శ్రీజ, సింగరేణి జీఎం సాలెంరాజు, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీలకు హార్వెస్ట్ విద్యార్థిని ఎంపిక

ఖమ్మం అర్బన్, ఏప్రిల్ 21: ఖమ్మం నగరంలోని హార్వెస్ట్ పాఠశాలకు చెందిన విద్యార్థిని చర్వి త ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు మహారాష్ట్రలో జరిగే జాతీయస్థాయి అండర్–14 ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ పోపూరి రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి తెలిపారు.

నేడు ఓపెన్ పరీక్షల పరిశీలనకు అబ్జర్వర్ రాక

ఖమ్మం అర్బన్, ఏప్రిల్ 21 : తెలంగాణ రాష్ట్ర ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలు కొనసాగుతున్న నేపథ్యంలో మంగళవారం అబ్జర్వర్ దుర్గాప్రసాద్ పరిశీలనకు జిల్లాకు రానున్నారు. మోడల్ స్కూల్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న దుర్గాప్రసాద్‌ను ఓపెన్ పరీక్షల పరిశీలనకు జిల్లా అబ్జర్వర్‌గా నియమించారు. సోమవారం పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు డీఈవో సోమశేఖరశర్మ, కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు.

పోప్ మృతికి సంతాపం

ఖమ్మం, ఏప్రిల్ 21: క్యాథలిక్స్ జగద్గురువు పోపు ఫ్రాన్సిస్ మృతి పట్ల ఖమ్మం బిషప్ డాక్టర్ సగిలి ప్రకాశ్ సోమవారం సంతాపం తెలిపారు. పేదలు అంటే ఫ్రాన్సిస్‌కు అమితమైన ప్రేమ, ఆప్యాయతలు ఉన్నాయని పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగలు అరెస్టు

విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రఘు

పెనుబల్లి, ఏప్రిల్ 21: కొంతకాలంగా ద్విచక్ర వాహనాలు చోరీకి పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కల్లూరు ఏసీపీ రఘు తెలిపారు. సోమవారం వీఎం.బంజర స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. ఆదివారం సాయంత్రం వీఎం.బంజర ఎస్సై వెంకటేశ్, సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేస్తున్నారు. అదే సమయంలో ఇద్దరు వ్యక్తులు ఖమ్మం నుంచి వీఎం.బంజర వైపు వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలను నిలిపి పరిశీలించారు. ద్విచక్ర వాహనాలకు ఎటువంటి పేపర్లు చూపకుండా, తడబడుతూ సమాధానం సరిగా చెప్పనందున అట్టి ఇద్దరు వ్యక్తులను స్టేషన్‌కు తరలించి విచారించారు. భద్రాద్రి జిల్లా దమ్మపేట గ్రామానికి చెందిన ముక్కెళ్ల నాగరాజు, ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం తుంబూరు గ్రామానికి చెందిన చల్లా శివప్రసాద్‌లు కొంతకాలంగా ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తెలిందన్నారు. వీఎం.బంజర స్టేషన్ పరిధిలో 7 ద్విచక్ర వాహనాలు, సత్తుపల్లి స్టేషన్ పరిధిలో 3, వేంసూరు స్టేషన్ పరిధిలో 3, ఏలూరు జిల్లా పెద్దవెయ్యిలో 1, అశ్వారావుపేట, జంగారెడ్డిగూడెం ప్రాంతాల్లో 4 మొత్తం 18 ద్విచక్ర వాహనాలు వీరు దొంగతనం చేసినట్లు పేర్కొన్నారని చెప్పారు. వీటిలో గంగదేవిపాడు గ్రామానికి చెందిన వ్యక్తులకు 4, అన్నపురెడ్డిపల్లి మండలం రాజాపురం గ్రామంలో నలుగురు వ్యక్తులకు 12 మోటార్‌సైకిళ్లను అమ్మి డబ్బులను సమానంగా పంచుకున్నారు. దొంగిలించిన ద్విచక్ర వాహనాలు ఎన్నెస్పీ కాలువ పక్కన దాచి పెట్టారని తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన పోలీసు సిబ్బందిని ఖమ్మం సీపీ సునీల్‌దత్ అభినందించి అవార్డు ప్రకటించారని ఏసీపీ తెలిపారు. అవార్డును ఏసీపీ చేతుల మీదుగా అందజేశారు. విలేకరుల సమావేశంలో రూరల్ సీఐ ముత్తిలింగం, ఎస్సై వెంకటేష్ ఉన్నారు.

సైబర్ నేరస్తుడి అరెస్టు

మామిళ్లగూడెం, ఏప్రిల్ 21 : ఆన్‌లైన్ ప్రైవేటు ఉద్యోగం ఇప్పిస్తామని, ఆ తరువాత ఇన్వెస్ట్‌మెంట్ చేస్తే ఎక్కవ డబ్బులు వస్తాయని బాధితున్ని మోసం చేసిన కేసులో ఎంకే తమిళగన్ అనే నిందితున్ని అరెస్ట్ చేసి సైబర్ క్రైమ్ న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు ఖమ్మం సైబర్ క్రైమ్ డీఎస్పీ సీహెచ్‌ఆర్‌వీ ఫణిదర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని రామాంతపూర్ ప్రాంతంలో ఉంటూ ల్యాబ్ టెక్నిషియన్‌గా పనిచేస్తూ సైబర్, ఆన్‌లైన్ నేరాలకు పాల్పడుతున్న నిందితుడు ఓ బాధితుని ఖాతా నుంచి 9,25,575 రూపాయలను దోచుకుని తమ ఖాతాలో జమ చేసుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడి అడ్రస్‌ను గుర్తించి అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. తనతోపాటు మరికొంత మంది ఉన్నారని, ముఠాగా నేరాలకు పాల్పడుతున్నట్లు నిందితుడు ఒప్పుకున్నట్లు తెలిపారు. నిందితుడి ఖాతాపైన జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో మరో 17 కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఈ కేసును చాకచక్యంగా ఛేధించిన సైబర్ క్రైమ్ బృందం ఎస్‌ఐలు రంజిత్‌కుమార్, విజయ్‌కుమార్, కానిస్టేబుల్స్ వైవీ కృష్ణారావు, కిషన్‌రావును పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్‌కు గాయాలు

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 21: విధి నిర్వహణలో ఉన్న విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ గడ్డికొప్పుల రాములు సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. మండలంలోని ఎర్రగడ్డ గ్రామపంచాయతీ శివారు గోపాలపురానికి చెందిన రాములు తిరుమలాయపాలెంలో విద్యుత్ లైన్ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆదివారం రాత్రి గాలిదుమారంతో కురిసిన వర్షానికి విద్యుత్ సరఫరా నలిచిపోయింది. ఈ నేపథ్యంలో విద్యుత్‌లైన్ పరిశీలించిన అనంతరం కారులో వెళ్తుండగా మరిపెడబంగ్లా నుంచి ఖమ్మం వెళ్తున్న లారీ వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు రోడ్డు వెంబడి విద్యుత్ స్తంబాలను ఢీకొని బోల్తాపడింది. కారు నడుపుతున్న రాములుకు స్వల్పగాయాలయ్యాయి. రాములును తోటి ఉద్యోగులు ఖమ్మం ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందించారు.

పాము కాటుకు వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 21: పాము కాటుకు ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం మండలంలోని కుక్కలతండాలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుక్కలతండాకు చెందిన గుగులోత్ కిషన్ (38) పొలం వద్ద వరిగడ్డి వామి వేస్తుండగా అందులో ఉన్న పాము కాటేసింది. గమనించిన కుటుంబ సభ్యులు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతుడుకి భార్య సుమలత, ఇద్దరు పిల్లలున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ పై లైంగిక దాడికి యత్నం

బోనకల్లు, ఏప్రిల్ 21: మహిళపై లైంగిక దాడికి యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై మధుబాబు సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గోవిందాపురం గ్రామానికి చెందిన 55 సంవత్సరాల మహిళపై ఇదే గ్రామానికి చెందిన రవికుమార్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఆమె కేకలు వేయడంతో రవికుమార్ అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

673 మంది వాహనదారులపై కేసులు

మామిళ్లగూడెం, ఏప్రిల్ 21: పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ నెల 20 వరకు వాహనాల తనిఖీలు నిర్వహించగా మద్యం తాగి నడుపుతున్న 673 మంది వాహనదారులు, 21 మంది మైనర్ డ్రైవర్లపై కేసులు నమోదు చేశామని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా శని, ఆదివారాల్లో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ఆయా రోజుల్లో తనిఖీలు ఎక్కువగా చేస్తున్నామని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపైనా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **కల్లూరు బ్రాంచ్** వారు ఇచ్చిన బోగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **చిన్నదీవెల జ్యోతి,** W/o. జమలయ్య **వయస్సు:** 52సం||లు, **వృత్తి:**గృహిణి, నివాసం:ఇ.నెం: 3-133, బిల్లుపాడు గ్రామం, తల్లాడ మండలం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లైయిములు, తనఖాలు అగ్రిమెంట్లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 3 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : ఖమ్మం జిల్లా, కల్లూరు సబ్ రిజిస్ట్రారు వారి అధికార పరిధిలోని, ఖమ్మం జిల్లా, తల్లాడ రెవిన్యూ మండల పరిధిలోని, బిల్లుపాడు గ్రామపంచాయితీ ఏరియాలోని బిల్లుపాడు రెవిన్యూ రికార్డు దాఖలా విస్తీర్ణము : 153.33 చ||గ|| స్థలము లేదా 128.20 చ||మీ|| నివేశన స్థలము మరియు బిల్లుపాడు గ్రామకంఠంలోని గ్రామపంచాయితీ డోర్ నెం. 3-45/1 (Assessment No. 737), **డాక్యుమెంట్ నెం: 191/2025,** నెంబరు గల ఆర్‌సిసి బిల్డింగ్ వైశాల్యం :375 చ||అ||లు గల స్థిరాస్థికి సరిహద్దులు :**తూర్పు:** గ్రామపంచాయితీ రోడ్డు, **పడమర:** అల్లాడి కృష్ణ గారి ఇల్లు, **ఉత్తరము :** చిన్నదీవెల నారాయణరావు గారి ఇల్లు, **దక్షిణము :**అల్లాడి యాలాద్రి గారి ఇల్లు.

పలివెల గణేష్ బాబు
అడ్వకేట్, కొత్తగూడెం.సెల్ : 9849246278

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

CHANGE OF NAME

★I, KANDHULA SANDHYA RANI, W/o. Venkata Ramaiah Kandhula, R/o. H.No. 9-1-162/2, Shanthi Nagar Colony, Bhadrachalam (P.O) and Mandal, Bhadradri Kothadudem (District), Telangana-507 111, have Changed My Name to KANDULA SANDHYA RANI and My Husband's Name to KANDULA VENKATA RAMAIAH.
NT-342751

CHANGE OF NAME

★I, NALLAGORLA SRINIVAS RAO, R/o. 9-1-22/3, Gollagatta Road, Bhadrachalam, Bhadradri Kothagudem, TS-507 111. Changed My Name as NALLAGORLA SRINIVASA RAO, S/o. Subbarao.
NT-342752

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ



నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు

సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు

సెల్ : 9182777616